సాక్షి
వరంగల్
శనివారం | 4 | మే | 2024



రైలు పట్టాల వీల్ బేరింగ్..

రైలు ప్రమాదాల నివారణకు అధికారులు హాట్ యాక్సిల్ బాక్స్ డిటెక్షన్ సిస్టమ్ పేరుతో ప్రత్యేక పరికరాన్ని ఏర్పాటు చేశారు. - IIలో▸



రేపే నీట్

- IIలో▸

వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 5వ తేదీన నిర్వహించే నీట్-2024కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు నీట్ ఉమ్మడి వరంగల్ జిల్లా సిటీ కోఆర్డినేటర్ మంజులాదేవి తెలిపారు.

గరిష్టం/కనిష్టం
43^0 /28^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో మధ్యాహ్నం వడగాల్పులు వీస్తాయి. సాయంత్రం ఉక్కపోత ఉంటుంది.

ఎలాగైనా నెగ్గాలె!



'పార్లమెంట్'పై మూడు పార్టీల గురి

- వరంగల్, మహబూబాబాద్‌లో పతాకస్థాయికి చేరిన ప్రచారం
- అసెంబ్లీ ఫలితాలపైన లోతైన విశ్లేషణ..
- 2018, 2023 ఫలితాలపై పోస్టుమార్టం
- ఓటింగ్ వ్యూహాలకు పదును పెడుతున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్



సాక్షిప్రతినిధి, వరంగల్ :

ప్రధాన రాజకీయ పార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం దూకుడు పెంచాయి. గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఎంపీ ఎన్నికల్లోనూ పై చేయి సాధించాలన్న పట్టుదలతో ఉంది. అధికారం కోల్పోయి అసెంబ్లీ ఫలితాలను విశ్లేషించిన బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికల్లో మళ్లీ సత్తా చాటుకునేందుకు సమాయత్తమైంది. తెలంగాణపై పట్టు బిగించడమే లక్ష్యంలో భాగంగా ఉమ్మడి వరంగల్‌లో రెండు ఎంపీ స్థానాలపై బీజేపీ.. వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. మూడు ప్రధాన పార్టీలు రెండు ఎంపీ సీట్లలో గెలుపే లక్ష్యంగా ఎత్తులు పైఎత్తులు వేస్తుండటం పొలిటికల్ హీట్ పెరిగింది.

ముక్కోణపు పోటీ.. ఎవరి ధీమా వారిదే..

ఉమ్మడి వరంగల్‌లోని వరంగల్ (ఎస్సీ), మహబూబాబాద్ (ఎస్టీ) స్థానాల్లో ముక్కోణపు పోటీ జరుగుతోంది. మహబూబాబాద్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత ఉండగా, కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ బీజేపీ నుంచి పోటీలో ఉన్నారు. వరంగల్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా.. బీఆర్ఎస్ టికెట్ ప్రకటించిన తర్వాత పార్టీ మారిన కడియం కావ్య కాంగ్రెస్ అభ్యర్థిగా తలపడుతున్నారు. బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పోటీలో వ్యూహాత్మకంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. అనూహ్యంగా బీఆర్ఎస్ అభ్యర్థయిన హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు. ఈ మూడు పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మంత్రులు, మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, మాజీ మంత్రులు, బీజేపీ కేంద్రమంత్రులు, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ దామీ తదితరులు ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 8న ఖిలావరంగల్ లక్ష్మీపురంలో సభ నిర్వహించనుండగా, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ తదితరులు మరో విడత ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయా పార్టీలు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.



ఎక్కడ తగ్గాం, ఎక్కడ నెగ్గాం..

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. జనగామ అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరి పార్లమెంట్ కిందకు వస్తుంది. 2018లో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 14 సెగ్మెంట్లలో 9 చోట్ల బీఆర్ఎస్, ఐదు చోట్ల కాంగ్రెస్ గెలిచింది. తర్వాత పరిణామాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన భూపాలపల్లి, ఇల్లందు, పినపాక ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, హరిప్రియ బానోతు, రేగ కాంతారావు బీఆర్ఎస్‌లో చేరారు. 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో 14 అసెంబ్లీ స్థానాలకు 12 చోట్ల కాంగ్రెస్, రెండు నియోజకవర్గాలు(స్టేషన్‌ఘన్‌పూర్, భద్రాచలం)లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్, భద్రాచలంలో గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఇదిలా ఉంటే.. పోలైన ఓట్లను పరిశీలిస్తే ఆ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి 6,63,556 ఓట్లు, బీఆర్ఎస్‌కు 5,03,298, బీజేపీకి 1,56,638 ఓట్లు వచ్చాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో కాంగ్రెస్‌కు 5,76,726 ఓట్లు, బీఆర్ఎస్‌కు 4,43,910, బీజేపీకి 34,476 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌తో పాటు గత పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను కూడా విశ్లేషిస్తున్న మూడు పార్టీల అగ్రనాయకత్వం.. వరంగల్, మహబూబాబాద్‌లో విజయమే లక్ష్యంగా పావులు కదుపుతోంది.

అభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యం

- బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్


సంగెంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

సంగెం : దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని ఆయన మాట్లాడారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశ ఆర్థిక వ్యవస్థను మూడో స్థానానికి తీసుకెళ్తుందని తెలిపారు. రేవంత్ రెడ్డి అరచేతిలో బెల్లం పెట్టి మోచేత నాకించాడని ఆరోపించారు. కడియం కావ్యకు ఎందుకు ఓటు వేయాలని ఆయన ప్రశ్నించారు. సంగెం-చింతలపల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం, టెక్స్‌టైల్ పార్కును మరింత అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అరూరి రమేశ్ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, డాక్టర్ రాజేశ్వర్‌రావుతోపాటు డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి


కవాతులో పాల్గొన్న సీపీ, పోలీస్ అధికారులు

రామన్నపేట: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా స్థానిక పోలీసులతో పాటు సెంట్రల్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో అర్బన్ ఓట్ల శాతం పెంచడంతో పాటు ఎన్నికల వేళ శాంతి భద్రతలపై ప్రజలు నమ్మకం కలిగించేందుకు ఈపోలీస్ కవాతు నిర్వహించినట్లు తెలిపారు. పోచమ్మ మైదాన్ నుంచి ప్రారంభమైన కవాతు మండిబజార్, వరంగల్ చౌరస్తా, వరంగల్ రైల్వే స్టేషన్ వరకు కొనసాగింది. డీసీపీ అబ్దుల్ బారీ, ట్రెయినీ ఐపీఎస్ శుభంనాగ్, సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్, ఏసీపీలు నందిరాంనాయక్, దేవేందర్ రెడ్డి, తిరుమల్, సెంట్రల్ జోన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, మూడు కంపెనీల సీఆర్పీఎఫ్, సివిల్, డిస్ట్రిక్ట్ గార్డ్స్ పోలీసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయాలి


మాట్లాడుతున్న మంద కుమార్

వర్ధన్నపేట : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయడమే మాదిగల లక్ష్యమని ఎంఎస్పీ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్ అన్నారు. వర్ధన్నపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎస్సీల వర్గీకరణపై అంకిత భావంతో ఉన్నారని తెలిపారు. ఇందులో భాగంగానే బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద శనివారం మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మహేందర్, మాసాని గోపాల్, ధర్మయ్య, సుధాకర్, రాపాక వినోద్, ఉదయ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



నర్సంపేట : ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధచూపాలని నర్సంపేటలోని తెలంగాణ డయాగ్నోస్టిక్స్ హబ్ క్వాలిటీ మేనేజర్ డాక్టర్ వి.శ్వేత సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ, ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ అధ్యక్షతన శుక్రవారం హెల్త్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె డయాగ్నోస్టిక్స్ హబ్‌లో అందుబాటులో ఉన్న వివిధ టెస్టులు, స్కానింగ్ సదుపాయాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చని తెలిపారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనాథ్, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఐ.శివనాగ శ్రీను, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.రమేష్, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ టి.సుమతి, అకడమిక్ కోఆర్డినేటర్ ఎం.నరేందర్, టి.రమేశ్, ఎల్.సత్యనారాయణ, బి.విష్ణుకుమార్, జి.ప్రసూన, ఎం.సమ్మయ్య, ఎం.శైలజ, పి.త్యాగయ్య, ఆర్.కుమారస్వామి, ఏఓ ఎన్.స్వరూపారాణి, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంహెచ్‌డీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రదీప్




గీసుకొండ : మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడిగా గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన గనిపాక ప్రదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎంహెచ్‌డీ వ్యవస్థాపక అధ్యక్షుడు యాతాకుల భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ క్యాదరి భాస్కర్ పేరుతో శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంత కాలం ప్రదీప్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



సంగెం: విద్యుత్ వినియోగదారులు, సిబ్బంది అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చని ఎన్పీడీసీఎల్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ ఎ.ఆనందం అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా కాపులకనిపర్తి, సంగెం, మచ్చాపూర్ సెక్షన్ల సిబ్బంది, వినియోగదారులకు 'విద్యుత్ భద్రత- పొదుపు'పై మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో వానలు, ఈదురు గాలులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీగలు తెగిపోవడం, సాగడం, స్తంభాలు విరగడం వల్ల ప్రమాదాలు పొంచి ఉంటాయని తెలిపారు. వ్యవసాయబావుల వద్ద రైతులు విద్యుత్ సిబ్బందికి తెలియకుండా ట్రాన్స్‌ఫార్మర్లు బంద్ చేయడం, ఫ్యూజులు వేసుకోవడం, స్తంభాలు ఎక్కడం వంటి పనులు చేయవద్దన్నారు. ఇంటిలో హౌస్‌వైరింగ్‌కు దగ్గరలో జీఐ వైరును దండెంగా వాడొద్దని సూచించారు. ఎవరికైనా విద్యుత్ షాక్ తగిలితే రక్షించేందుకు చేతులతో తాకవద్దని, విద్యుత్ ప్రసరించని వస్తువులతో మాత్రమే రక్షించాలన్నారు. అవసరం లేనప్పుడు వాడకుండా విద్యుత్‌ను పొదుపు చేయాలని సూచించారు. విద్యుత్ షాక్ తగిలి స్పృహ కోల్పోయిన వ్యక్తిని సీపీఆర్ ద్వారా బతికించవచ్చని వివరించారు. కార్యక్రమంలో వరంగల్ డివిజనల్ ఇంజనీర్ బి.భిక్షపతి, ఏడీఈ నర్సింహారావు, ఏఈలు తిరుపతిరెడ్డి, మధుసూదన్, సంపత్‌రెడ్డి, సబ్‌ఇంజనీర్లు తాజుద్దీన్, విక్రమ్, క్రాంతి, సురేష్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్య



నర్సంపేట రూరల్ : ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సంపేటలో శుక్రవారం జరిగిందని ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన మార్త సురేశ్ (45) వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే, ముంబాయికి చెందిన ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో సురేశ్ భార్యకు అప్పు ఉంది. నిత్యం ఫోన్ చేస్తుండడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆయన ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే దొంతి

నల్లబెల్లి : మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నల్లబెల్లి అధ్యక్షుడు బత్తిని మహేశ్, నాయకులు మాలోత్ రమేశ్, వైనాల అశోక్, చార్ల శివారెడ్డి, మాలోత్ చరణ్‌సింగ్, కడుదూరి కట్టయ్య, డ్యాగల కృష్ణ, వర్దం ఇంద్రారెడ్డి, జిల్లా మునేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగల్ తండాలో 10 కుటుంబాలు..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఏనుగల్‌తండాకు చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బానోత్ రవి, వార్డు మాజీ సభ్యుడు బోడ సోములు ఆధ్వర్యంలో 10 కుటుంబాలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వారికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అదేవిధంగా గురిజాల గ్రామ సొసైటీ మాజీ డైరెక్టర్ అల్లిరాజు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు గజ్జి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేశ్, కత్తి కిరణ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, మహిళా అధ్యక్షురాలు సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లుగొర్‌స్టేషన్ గ్రామం నుంచి..

సంగెం : ఎల్లుగొర్‌స్టేషన్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినట్లు పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుగులోత్ బొంద్యా, గుగులోత్ రమేష్, నర్సానగర్ నుంచి జాటోత్ భద్రయ్య పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, నాయకులు అచ్చ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య


ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కాశిబుగ్గ సెంటర్ : కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ శుక్రవారం పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. అదనపు ఈవీఎంలను వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు (బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు) కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈఎంఎస్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్‌ను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 792 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 2,615 బ్యాలెట్ యూనిట్లు అవసరముందని వివరించారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఆర్డీఓలు కృష్ణవేణి, సిద్ధం దత్తు, ఎన్నికల పర్యవేక్షకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ. శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, ఇండ్ల నాగేశ్వరరావు, ఫైజొద్దీన్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పన త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో జిల్లాలోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, సెక్టార్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, లైట్లు, పారిశుధ్య నిర్వహణ, షేడ్‌నెట్లు, పోలింగ్ సిబ్బందికి భోజనం, వైద్య సేవలు తదితర సదుపాయాలపై అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 10 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. ఐదో తేదీ వరకు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వయోవృద్ధులు, దివ్యాంగులకు సరైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీపీఓ కల్పన, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

121 మంది హోం ఓటింగ్

జిల్లాలో శుక్రవారం హోం ఓటింగ్ ద్వారా 121 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 60 మంది, వర్ధన్నపేటలో 61 మంది 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, పీడబ్ల్యూడీ ఓటర్లు ఓటు వేశారని పేర్కొన్నారు. అదేవిధంగా ఫెసిలిటేషన్ కేంద్రాల్లో కూడా 27 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారని కలెక్టర్ ప్రావీణ్య ఈ సందర్భంగా తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి

- ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- సంగంరెడ్డి సుందరరాజ్‌కు మరో 'సారీ'
- ఆశించి భంగపడిన ఉద్యమకారుడు వాసుదేవరెడ్డి




సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఏనుగుల రాకేశ్‌రెడ్డిని ప్రకటించారు. ఈ మేరకు గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి వరంగల్ ప్రస్తుత హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలం వంగపహాడ్ రాకేశ్‌రెడ్డి స్వగ్రామం. సామాన్య రైతు కుటుంబానికి చెందిన రాకేష్‌రెడ్డి బిట్స్ పిలానిలో మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎంఎంఎస్), మాస్టర్స్ ఇన్ ఫైనాన్స్ (ఎంఎస్) పూర్తి చేశారు. సిటీ బ్యాంకు మేనేజర్‌గా, జేపీ మోర్గాన్, ఫేస్‌బుక్‌లాంటి పలు అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీల్లో బెంగళూరు, అమెరికాలో ఏడేళ్ల పాటు ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు చేసిన ఆయన రాజకీయాలపై ఆసక్తితో 2013లో భారతీయ జనతా పార్టీ ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అంచలంచెలుగా బీజేపీలో ఎదుగుతూ బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, రెండు పర్యాయాలు రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. బీజేపీలో వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన రాకేశ్‌రెడ్డి వరంగల్ కేంద్రంగా అనేక ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ వరంగల్ పశ్చిమ టికెట్ నిరాకరించడంతో ఆయన కేసీఆర్, కేటీఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. యువత, విద్యావంతులతో మంచి సంబంధాలున్నాయని భావించిన కేసీఆర్.. శుక్రవారం వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డికి అవకాశం కల్పించారు.

సుందరరాజ్, వాసుదేవరెడ్డికి నిరాశ..

తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీలో కొనసాగుతున్న విద్యావంతులు, ఉద్యమకారులు సంగంరెడ్డి సుందరరాజ్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి కూడా ఎమ్మెల్సీ టికెట్ బీఆర్ఎస్ నుంచి ఆశించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న రాకేశ్‌రెడ్డికి చాన్స్ దక్కడంపై బీఆర్ఎస్‌లో ఉద్యమ నేపథ్యం ఉన్న పట్టభద్రుల్లో చర్చ జరుగుతోంది. 2016, 2021లో రెండు సందర్భాల్లో పట్టభద్రుల స్థానం కోసం ఈ ఇద్దరు కూడా ప్రయత్నాలు చేయగా..లాబీయింగ్‌తో ఆ అవకాశాన్ని పల్లా రాజేశ్వర్‌రెడ్డి దక్కించుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను అభ్యర్థిగా ప్రకటించగా... ఆయనకు దీటుగా బీసీ సామాజిక వర్గానికి చెందిన సుందరరాజ్‌కు అవకాశం ఇస్తారని అందరూ భావించారు. లేదంటే వాసుదేవరెడ్డికైనా చాన్స్ దక్కవచ్చని భావించిన తరుణంలో అనూహ్యంగా ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అధిష్టానం అభ్యర్థిగా ప్రకటించింది. ఇందులో కూడా జనగామ జిల్లాకు చెందిన నియోజకవర్గం స్థాయి ప్రజాప్రతినిధి చక్రం తిప్పారన్న ప్రచారం బీఆర్ఎస్ సర్కిళ్లలో సాగుతోంది.

సీత్యతండాలో అగ్ని ప్రమాదం


అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న మొక్కజొన్న చొప్ప

- మూడు కిలోమీటర్లు వ్యాపించిన మొక్కజొన్న చొప్ప మంటలు
- ఆర్పివేసిన అగ్నిమాపక శాఖ అధికారులు

పర్వతగిరి : మండలంలోని మోత్యతండా గ్రామపంచాయతీ శివారు సీత్యతండాలో శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తండా శివారులో రైతులు ఎక్కువగా మొక్కజొన్న పంట సాగుచేశారు. చొప్పను కాల్చేందుకు ఓ రైతు నిప్పంటించి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. మూడు కిలోమీటర్లు మంటలు చెలరేగడంతో సమాచారం తెలుసుకున్న ఎస్సై గుగులోత్ వెంకన్న పోలీసు బృందంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక బృందానికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్లు చేరుకుని మంటలు ఆర్పివేశాయి. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు.

ఖోఖో శిక్షణ శిబిరం ప్రారంభం


గీసుకొండలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్

గీసుకొండ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా క్రీడల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఖోఖో వేసవి శిక్షణ శిబిరాన్ని గీసుకొండ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ ప్రారంభించారు. 4 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్యాంపు ఇన్‌చార్జ్ కోట రాంబాబు కోరారు. ఎస్సై వెంకన్న, కర్ణకంటి రామ్మూర్తి పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారాల్లో రాణించాలి

సంగెం: మహిళలు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకుని కుటీర పరిశ్రమలు, వ్యాపారాల్లో రాణించాలని సెర్ప్ సంస్థాగత నిర్మాణ డైరెక్టర్ నవీన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. మోడల్ సీఎల్ఎఫ్, మండల రిసోర్స్ సెంటర్ ఏర్పాటు కోసం కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం మండల సమాఖ్య నెలవారీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తోందని, పాత వ్యాపారాలకు తోడుగా కొత్త వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు మేనేజర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు, విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు మహిళలను చైర్‌పర్సన్లుగా నియమించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేవిధంగా కృషి చేయాలని సూచించారు. అడిషనల్ డీఆర్‌డీఓ రేణుకాదేవి, డీపీఎంలు దయాకర్, సరిత, భవాని, చంద్రశేఖర్, ఏపీఎం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఐదుగురు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న తీన్మార్ మల్లన్న, పక్కన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

నల్లగొండ: నల్లగొండ – వరంగల్– ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి శుక్రవారం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా మాధవపెద్ది వెంకట్‌రెడ్డి ఒక సెట్, చంద్రశేఖర్ రెండు సెట్లు నామినేషన్ పత్రాలను నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేశారు. అదేవిధంగా అలియన్స్ డెమొక్రటిక్ రీఫామ్స్ పార్టీ అభ్యర్థి ఈడ శేషగిరిరావు ఒక సెట్, తెలంగాణ సకల జనుల పార్టీ అభ్యర్థి నందిపాటి జానయ్య ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

8న లక్ష్మీపురంలో ప్రధాని మోదీ బహిరంగ సభ

- లక్ష మందితో బీజేపీ ఆశీర్వాద సభ
- సభా స్థలం పరిశీలన..ఏర్పాట్లు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న అరూరి రమేశ్

మామునూరు: ఈ నెల 8న దేశ ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్‌కు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం రోడ్డు లక్ష్మీపురం మైదానంలో జరిగే బీజేపీ ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం సభాస్థలాన్ని ఆ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, నాయకులు రావు పద్మ, రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కీర్తిరెడ్డి, దశమంతరెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా రమేశ్ కొబ్బరికాయ కొట్టి సభప్రాంగణ పనులను ప్రారంభించారు. అంతకుముందు స్థానిక కార్పొరేటర్ జలగం అనిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీతోనే వరంగల్ అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఆశీర్వాద సభకు దేశ ప్రధాని మోదీ రానున్నారని, లక్ష మందికిపైగా జనం స్వచ్ఛందగా తరలివచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ నెల 8న ఉదయం 11.30 గంటలకు ప్రధాని మోదీ మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 11.50గంటలకు లక్ష్మీపురం సభాస్థలికి చేరుకుని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 12.45 నిమిషాలకు తిరిగి మామునూరు ఎయిర్ పోర్ట్‌నుంచి కరీంనగర్ బహిరంగ సభకు తరలివెళ్లనున్నారని తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నేతలు మల్లాడి తిరుపతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, గజ్జెల శ్రీరాములు, బన్న ప్రభాకర్, సంపత్‌రెడ్డి, సాంబయ్యయాదవ్, అర్చన, గందె నవీన్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలు యథాతథం

- వాయిదా పుకార్లు నమ్మవద్దు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ కోర్సుల 2, 4, 6 సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 6వ తేదీ నుంచి యథావిధిగా కొనసాగుతాయని వాయిదా వేసినట్లుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లు నమ్మొద్దని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

రైలు పట్టాల వీల్ బేరింగ్ | వేడి క్షణాల్లో గుర్తింపు!

హాట్ యాక్సిల్ బాక్స్ డిటెక్షన్ సిస్టమ్ ఏర్పాటుచేసిన రైల్వేశాఖ

- మొదటిసారిగా డోర్నకల్ జంక్షన్‌లో అమర్చిన దక్షిణ మధ్య రైల్వే
- అప్‌అండ్‌డౌన్ రైలు మార్గాల్లో ఏర్పాటు.. నిత్యం వీల్‌బేరింగ్ ఉష్ణోగ్రత పరిశీలన
- పట్టాలు తప్పకుండా ముందస్తు జాగ్రత్తలు



డోర్నకల్ జంక్షన్ పరిధిలోని రైలు పట్టాల పక్కన ఏర్పాటు చేసిన హాట్ యాక్సిల్ బాక్స్



బాక్స్‌పై ఏర్పాటు చేసిన వివరాలు

డోర్నకల్: ప్రయాణికుల భద్రత, రైలు ప్రమాదాల నివారణ కోసం దక్షిణమధ్య రైల్వే అధికారులు పలు సాంకేతిక చర్యలు చేపడుతున్నారు. రైళ్లు పరుగెడుతున్న సమయంలో వీల్‌కు అమర్చిన బేరింగ్ సక్రమంగా పనిచేయకపోవడం, దెబ్బతినడంతో ఉష్ణోగ్రత పెరిగి చక్రాలు రైలుపట్టాలు తప్పి ప్రమాదాలు జరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇక వేసవిలో ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ పరిస్థితిని గమనించి ప్రమాదాల నివారణకు రైల్వే అధికారులు హాట్ యాక్షన్ బాక్స్ డిటెక్షన్ సిస్టమ్ పేరుతో ప్రత్యేక పరికరాన్ని రైలు పట్టాల పక్కన అమరుస్తున్నారు. ఈ పరికరాన్ని దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మొట్టమొదటిసారిగా హైదరాబాద్–విజయవాడ రూట్‌లోని మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో అమర్చారు.

బోగీ వీల్ బేరింగ్ పరిశీలన..

రైలు పట్టాలకు ఇరుపక్కలా ఏర్పాటు చేసిన హాట్ యాక్సిల్ డిటెక్షన్ సిస్టమ్ రైలు పరిగెడుతున్న సమయంలో ప్రతీ బోగీ వీల్‌కు అమర్చిన బేరింగ్‌ను పరిశీలిస్తుంది. బేరింగ్ ఉష్ణోగ్రతను పరిశీలించి క్షణాల్లో బేరింగ్ స్థితిని డివిజన్ కంట్రోల్ కార్యాలయంతోపాటు సీఅండ్‌డబ్ల్యూ సూపర్‌వైజర్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందిస్తుంది. వీల్ బేరింగ్ ఉష్ణోగ్రతకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా ఎస్ఎంఎస్ ద్వారా ప్రత్యేక శబ్దంతో సిబ్బందిని అప్రమత్తం చేస్తుంది. బోగీతోపాటు సమస్య తలెత్తిన వీల్ లొకేషన్‌ను కచ్చితంగా సూచిస్తుంది. రైలు 160 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నా ప్రతీ బోగీకి సంబంధించి వీల్ బేరింగ్ స్థితిని పరీక్షించి క్షణాల్లో సిబ్బందికి సమాచారం చేరవేస్తుంది.

ప్రతిరోజూ వందకు పైగా రైళ్లు..

వరంగల్, విజయవాడ రైలు మార్గంలో ప్రతిరోజూ అప్‌అండ్ డౌన్ మార్గాల్లో 100 నుంచి 120కు పైగా రైళ్లు పరుగులు తీస్తున్నాయి. రెండు మార్గాల్లో అమర్చిన హాట్ యాక్సిల్ బాక్స్ డిటెక్షన్ ద్వారా రైళ్ల బోగీలకు సంబంధించిన ప్రతీ వీల్ బేరింగ్‌ను తనిఖీ చేసి టెంపరేచర్ స్టేటస్‌ను ఎస్ఎంఎస్ ద్వారా అధికారులకు అందజేస్తుంది. మార్చి చివరి వారంలో ఏర్పాటు చేసిన డిటెక్షన్ సిస్టమ్ ద్వారా సీఅండ్ డబ్ల్యూ సిబ్బంది రైళ్ల పరిస్థితిని గమనిస్తూ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

దక్షిణ మధ్య రైల్వేలో మొదటిసారి..

దక్షిణ మధ్య రైల్వే డివిజన్‌లో మొదటిసారి సీఅండ్‌డబ్ల్యూ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ పరికరాన్ని డోర్నకల్ జంక్షన్ పరిధిలో అమర్చారు. విజయవాడ వైపు వెళ్లే మార్గంలో గుండ్రాతిమడుగు, డోర్నకల్ మధ్య మద్దివంచ వద్ద, కాజీపేట వైపు వెళ్లే మార్గంలో మల్లెమడుగు, డోర్నకల్ మధ్య పాపటపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఈ హాట్ యాక్సిల్ బాక్స్ డిటెక్షన్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. రెండు మార్గాల్లో వెళ్తున్న రైళ్లకు సంబంధించి రైలు బోగీ వీల్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తినా గుర్తించి డోర్నకల్ స్టేషన్‌లో రైళ్లను నిలిపి మరమ్మతులు చేసి పంపిస్తారు. ప్రస్తుతం ఇతర డివిజన్లలోని రైలు మార్గాల్లోనూ హాట్ యాక్సిల్ బాక్స్ అమర్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపే నీట్

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- పరీక్షకు హాజరుకానున్న 5,205 మంది విద్యార్థులు
- ఉమ్మడిజిల్లా కేంద్రంలో 9 పరీక్ష కేంద్రాలు
- ఉదయం 11:30గంటల నుంచే అనుమతి
- సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష నిర్వహణ



మాస్టర్జీ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం

విద్యారణ్యపురి : వైద్యవిద్యలో ప్రవేశానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్–2024(నేషనల్ ఎల్జిబులిటి ఎంట్రెన్స్ టెస్టు) ఈనెల 5న(ఆదివారం) నిర్వహించనున్నారు. ఆఫ్‌లైన్‌లోనే ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించనుంది. ఉమ్మడి వరంగల్‌జిల్లా కేంద్రంలో నీట్‌కు సర్వసిద్ధం చేశారు. ఈ పరీక్షకు 5,205మంది విద్యార్థులు రాయనుండగా, ఇందుకు తొమ్మిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. 9మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించగా, 19మంది అబ్జర్వర్లు పర్యవేక్షించబోతున్నారు. స్క్వాడ్ బృందాలు కూడా ఉంటాయని సమాచారం. నీట్ పరీక్ష ఈనెల 5న(ఆదివారం) మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం5 గంటల 20 నిమిషాల వరకు జరగనుందని ఉమ్మడి వరంగల్ జిల్లా సిటీ కోఆర్డినేటర్, హనుమకొండలోని గ్రీన్‌వుడ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సి.మంజులాదేవి శుక్రవారం తెలిపారు. ఉదయం 11:30గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1:30గంటలకు మెయిన్ గేట్‌లోకి వెళ్లేందుకు చివరి సమయం అనంతరం విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోరు. నిర్దేశించిన సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు.

పరీక్ష కేంద్రాలు ఇవే..

మాస్టర్జీ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, వరంగల్ పబ్లిక్ స్కూల్ , సేయింట్ పీటర్స్ పబ్లిక్ స్కూల్, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ(హనుమకొండ) ఎస్ఆర్ ప్రైమ్ (వరంగల్), హనుమకొండ హంటర్‌రోడ్డులోని అల్లూరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంటు సైన్సెస్, గ్రీన్‌వుడ్ హైస్కూల్ (హసన్‌పర్తి), ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (భీమారం) ఉన్నాయి.

పలు నిబంధనలు..

పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోరు. విద్యార్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ ఫ్రిస్కింగ్ ఉంటుంది. క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. షూస్‌తో పాటు ఎలాంటి ఆభరణాలను ధరించకూడదు. విద్యార్థినులు ఆభరణాలతోపాటు మెహందీ కూడా పెట్టుకొని రాకూడదు. సంప్రదాయ దుస్తులు వేసుకొని రావాల్సింటుంది. ప్రతి పరీక్ష కేంద్రంలోను ఎన్‌టీఏ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రంలో ఎన్ని గదులు ఉంటే అన్ని గదుల్లోనూ సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. అంతేగాకుండా ఎవరూ కూడా సెల్‌ఫోన్‌లు తీసుకుపోకూడదు. సెల్‌ఫోన్‌లు పనిచే యకుండా పరీక్షాకేంద్రాల్లో జామర్లను కూడా ఏర్పాటుచేశారు. మొత్తంగా ఎన్‌టీఏ పర్యవేక్షణలోనే నీట్ పరీక్ష పకడ్బందీగా జరగనుంది.

పకడ్బందీగా ఏర్పాట్లు



నీట్ పరీక్ష నిర్వహణకు ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలోని తొమ్మిది పరీక్ష కేంద్రాలను ఏర్పాట్లు చేశారు. ఎన్‌టీఏ చేసింది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒక ఐడెంటిటీ ప్రూఫ్ వెంట తీసుకు రావాల్సి ఉంటుంది. ముందుగానే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 11:30గంటల నుంచే పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తారు. నిర్దేశించిన సమయానికి నిమిషం ఆలస్యమైతే పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతించబోరు.

– సి.మంజులాదేవి, నీట్ ఉమ్మడి వరంగల్ జిల్లా సిటీ కోఆర్డినేటర్

ఎన్నికల్లో కమ్యూనిస్టులే ప్రధాన భూమిక



అభివాదం చేస్తున్న మంత్రి తుమ్మల, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, బలరాంనాయక్, తదితరులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నెహ్రూసెంటర్ : దేశంలో ప్రజల పక్షాన నిరంతరం పోరాడే సీపీఐ, కమ్యూనిస్టు పార్టీలే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు, మతతత్వ బీజేపీని ఓడించేందుకు ప్రధాన భూమిక పోషిస్తారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీపీఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలిపించాలని సీపీఐ ప్రజా పిలుపు సభ జిల్లా కేంద్రంలోని బాలాజీగార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సీపీఐ నిబద్ధతతో కృషి చేసిందన్నారు. ప్రజావ్యతిరేక పాలకులను గద్దెదించే సత్తా కమ్యూనిస్టులకే ఉందని ఆయన పేర్కొన్నారు. పేదవాడికి ఎక్కడ అన్యాయం జరిగిన, ఎక్కడ కష్టం వచ్చిన కమ్యూనిస్టులు వారి పక్షానే ఉంటూ పోరాటాలు చేస్తారని తెలిపారు.సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. పేదవాడి పక్షాన పోరాటాలు చేసేందుకు సూర్యచంద్రులు ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, మానుకోట పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, బి.అజయ్‌సారధిరెడ్డి, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, భాగం హేమంతరావు, తమ్మెర వీశ్వేశ్వర్‌రావు, సాబీర్‌పాష, అయోధ్య, ఘనపురపు అంజయ్య, పంజాల రమేష్, మల్లికార్జున్, నీరజ ధర్మన్న, పెరుగు కుమార్ పాల్గొన్నారు.

హిస్టరీ హెచ్‌ఓడీ రాజీనామా!

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగం అధిపతిగా తాను బాధ్యతలు నిర్వర్తించబోనని ప్రొఫెసర్ టి.మనోహర్ రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి లేఖ అందజేసినట్లు సమాచారం. హిస్టరీ విభాగంలో ఒకే ఒక్క రెగ్యులర్ ప్రొఫెసర్‌గా టి.మనోహర్ మాత్రమే ఉన్నారు. పలువురు కాంట్రాక్టు, పార్ట్‌టైం లెక్చరర్లు ఉన్నారు. మనోహర్ సోషల్ సైన్స్ డీన్ గాను, హిస్టరీ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆ విభాగంలో నాల్గోసెమిస్టర్ విద్యార్థులకు అటెండెన్స్ ఇచ్చే విషయంలో వివాదం తలెత్తినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఆచార్య మనోహర్ రాజీనామా చేయడంతో యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. అయితే కొన్నినెలల క్రితం కూడా ఆచార్య మనోహర్ విభాగాధిపతి పదవి నుంచి తప్పుకుంటున్నట్లు రాజీనామా లేఖను అప్పటి రిజిస్ట్రార్‌కు అందజేశారు. కానీ ఆమోదించకపోవడంతో మళ్లీ ఆయనే కొనసాగుతున్నారు. ప్రొఫెసర్ టి.మనోహర్ తప్పుకుంటే ఇక కాంట్రాక్టు లెక్చరర్లలో సీనియర్ కాంట్రాక్టు లెక్చరర్‌ను విభాగాధిపతిగా నియమించాల్సి ఉంటుంది.

సరెండర్ చేసినా కుర్చీ వదలరు

- 13 ఏళ్లుగా ఎంజీఎంలోనే తిష్ట
- కోర్టు స్టేతో తిరిగి జాయినింగ్



ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ కుర్చీని వదలడం లేదు. 13 ఏళ్లుగా ఇక్కడే ఉన్నా ఇంకా ఎంజీఎంను వదలడం లేదు. పరిపాలన పరమైన కారణాలతో ఇటీవల ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ సదరు అధికారిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సుదీర్ఘకాలం పాటు ఆయన ఇక్కడే తిష్ట వేసిన ఆయనకు ఇక్కడ ఏం దొరికిందో ఏమో కానీ..? సరెండర్ ఉత్తర్వులకు కోర్టు నుంచి స్టే తెచ్చుకుని తిరిగి దర్జాగా తన సీటును అలంకరిస్తున్నాడు.

అసలు ఇక్కడ ఏముంది.?

పరిపాలన విభాగంలో పనిచేసే ఈ విభాగం అధిపతి అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి మొదలుకొని జూనియర్ అసిస్టెంట్ వరకు దశాబ్దాలు ఎంజీఎంను వీడడంలేదు. ఇటీవల ఆస్పత్రిలో అంతర్గత బదిలీలు నిర్వహించారు.అయితే కొత్తగా కేటాయించిన స్థానాల్లో చేరిన కొందరు ఉద్యోగులు కేవలం మూడు రోజుల్లోనే తిరిగి ఎవరి స్థానాల్లో వారు జాయిన్ అయ్యారు. ఎంజీఎంలో బదిలీలకు విలువ లేకుండా పోయిందని, ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకునే నాథుడే కరువయ్యాయని విమర్శలు వినిపిస్తున్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి..

ఎంజీఎం పరిపాలన విభాగంలో సుదీర్ఘంగా తిష్ట వేసిన జూనియర్ అసిస్టెంట్ నుంచి మొదలుకొని ఏడీ వరకు వారు నిర్వహించిన సెక్షన్లపై ఏసీబీ ఉన్నతాధికారులచే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తే వైద్యారోగ్య శాఖ ఉద్యోగులను బదిలీలు చేసే ప్రభుత్వం ఎంజీఎంను ఎందుకు విస్మరిస్తుందో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు సమూల మార్పుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పర్యావరణ రక్షణకు న్యాయవ్యవస్థ కృషి



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

వరంగల్ లీగల్: ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ కోసం న్యాయవ్యవస్థ కూడా భాగస్వామ్యం అవుతుందని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ అన్నారు. ఉభయ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. న్యాయవ్యవస్థకు న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది అందరూ పట్టుగొమ్మలని కొనియాడారు. తామంతా సమష్టిగా కృషి చేస్తూ న్యాయదేవతను కాపాడుకుందామని అన్నారు. కవి, గీత రచయిత, గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, కాళోజీ సాహిత్య పురస్కార అవార్డు గ్రహీత జయరాజ్ మాట్లాడుతూ మానవ జీవితం ప్రకృతితో ముడిపడి ఉందని, మనిషి తనకు కావాలిసిన దాన్ని ప్రకృతి నుంచి పొందుతూ, ప్రకృతిని మాత్రం నాశనం చేస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడితేనే మనిషి మనుగడ సాగుతుందని వివరించారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి అపర్ణదేవి, న్యాయమూర్తులు, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ మోకాళ్ల సత్యనారాయణ గౌడ్, బార్ కౌన్సిల్ సభ్యులు సంజీవరావు, జయాకర్, దుస్సా జనార్దన్, హనుమకొండ, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రమేష్‌బాబు, తీగల జీవన్‌గౌడ్, ముదసర్ అహ్మద్, ఎల్.రమేష్, బార్ అసోసియేషన్ల ప్రతినిధులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అద్భుతం.. ప్రాజెక్టు ఎక్స్‌పో

- ఏషియా యూనివర్సిటీ రిక్యూటింగ్ డాక్టర్ ఫహద్



ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్న ఫహద్

హసన్‌పర్తి : ఎక్స్‌పో ప్రాజెక్టు (ఎక్స్ పో–యంత్రం 2.0) అద్భుతమని ఏషియా యూనివర్సిటీ రిక్యూటింగ్ డాక్టర్ మహ్మద్ ఫహద్ అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని ఎస్సార్ యూనివర్సిటీ తన రెండో వెర్షన్ ప్రాజెక్టు ఎక్స్‌పో –యంత్రం 2.0ను శుక్రవారం ప్రదర్శించింది. ఈ కార్యక్రమానికి ఫహద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అనేక విషయాలను తెలుసుకునేందుకు ఇంటర్న్‌షిప్‌లు సరైన వేదిక అన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దీపక్‌గార్గ్ మాట్లాడుతూ.. ఔట్‌పుట్ సాంకేతికతను బదిలీ చేయడం తదితరాలకు ఎక్స్‌పో యంత్ర 2.0 ప్రారంభించామన్నారు. స్కూల్ ఆఫ్ బిజినెస్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈసందర్భంగా అతిథులను మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, యంత్ర సమన్వయ కర్తలు, ఆర్గనైజింగ్ బృంద సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీవాలను కాపాడుకుందాం..

- వడదెబ్బ, ఎండ నుంచి రక్షించుకుందాం..
- పశువులను మేపే విధానం, ఆరోగ్య రక్షణ, చికిత్సపై పశువైద్యాధికారి సూచనలు



డాక్టర్ మంజీలాల్



చెన్నారావుపేట : భానుడు భగభగ మండుతున్నాడు.. వాతావరణం నిప్పుల కొలిమిలా మారుతుంది.. ఉక్కపోతతో మానవులతో పాటు జంతుజాలం తల్లడిల్లుతోంది.. ఎండల తీవ్రత, అధిక ఉష్ణోగ్రత, వేడిగాడ్పులు, వడదెబ్బతో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు అనారోగ్యానికి గురవుతాయి. మారుతున్న వాతావరణ మా ర్పులకు అనుగుణంగా వాటిని శాస్త్రీయ యాజ మాన్య పద్ధతిలో పెంచడం వల్ల వాటి ఉత్పాదక శక్తి తగ్గకుండా రైతు ఆశించిన ఫలితాలను పొందవచ్చని డాక్టర్ మంజీలాల్ పలు సూచనలు చేశారు.

పశువులలో వడదెబ్బ..

అధిక ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, షెడ్లలో అధిక సంఖ్యలో కిక్కిరిసి ఉండటం, ఉక్కపోత, నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడదెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి, బలహీనంగా మారుతాయి. పశువులు సరిగా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. జీవక్రియ తగ్గిపోవడం, ఆకలి మందగించడం, ఆహారం తక్కువగా తీసుకుంటాయి. వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశం పెరుగుతాయి. కొన్ని సమయాల్లో దాహంతో ఉన్న పశువులు మురికి గుంటల్లో నీటిని తాగడం వల్ల పారుడు వంటి జీర్ణకోశ వ్యాధులు సంక్రమిస్తాయి. చూడి పశువులలో గర్భస్రావాలు సంభవించే అవకాశాలు ఉంటాయి. వడదెబ్బకు గురైన వాటిలో దాహం పెరిగి, శ్వాస కష్టమవడంతో ఒక్కోసారి అపస్మారక స్థితికి వెళ్లి మరణించే అవకాశం ఉంటుంది.

పశువులను మేపడం..

ఉష్ణతాపంతో జీర్ణక్రియ సన్నగిల్లుతుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలు ఇవ్వడం మంచిది. ఎక్కువ శాతం పచ్చిగడ్డి ఇవ్వాలి. ఒకవేళ మాగుడు గడ్డి సమృద్ధిగా ఉంటే అందించవచ్చు. పచ్చిగడ్డిని ఉదయం, ఎండుగడ్డిని రాత్రి వేళలో విభజించి ఇవ్వాలి. అధిక పాలను ఇచ్చే పశువులకు పశుదాణాను నీటితో కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్సర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మంచిది. పశువుల్ని మేపేందుకు ఎండవేళ కాకుండా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు బయటకు పంపడం మంచిది.

ఆరోగ్య రక్షణ..

వేసవి తాపంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. వ్యాధినిరోధక టీకాలు ఇది వరకు వేయించని పశువులు, గొర్రెలు, మేకలలో గాలికుంటు వ్యాధి, గొంతువాపు, జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. నట్టల నివారణకు మందులు క్రమం తప్పకుండా తాగించాలి.

ప్రథమ చికిత్స..

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్లి శరీర ఉష్ణోగ్రత తగ్గించడానికి పలుమార్లు నీటితో కడగడం, తల నుదిటి మీద మంచుముక్కలు ఉంచడం లేదా చల్లని గోనె సంచిన దానిపై కప్పాలి. వెంటనే పశువైద్యుని సంప్రదించాలి. పశువైద్యుని పర్యవేక్షణలో గ్లూకోజ్ సెలైన్, సోడియం క్లోరైడ్ అందించాలి.

సూచనలు..జాగ్రత్తలు

గొర్రెలు, మేకలను వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం మాత్రమే బయటకి మేపడానికి తీసుకెళ్లాలి. ఎండ తీవ్రత ఉన్నప్పుడు పాకల్లోనే ఉంచాలి. పశుగ్రాస వసతి ఉంటే షెడ్లలో మేపడమే మంచిది. పగటి సమయంలో పాకలు, షెడ్‌లకు గోనె సంచులు కట్టి తడపడం వల్ల లోపల చల్లగా ఉంటుంది. వేసవిలో తగినంత తాగునీరు అందుబాటులో ఉంచాలి. (వేసవిలో ప్రతి పశువుకు సుమారుగా 60–70 లీటర్ల తాగునీరు అవసరం) వీలైనంత ఎక్కువగా పచ్చిమేత అందించాలి. దాణా తడిపి ఇవ్వడం మంచిది. పాడిపశువులను పెంపకం, గొర్రెల మేకల పెంపకం చేపట్టే రైతులు షెడ్లలో ఫ్యాన్లు, ఫాగర్స్ ఏర్పాటుకోవడం మంచిది. కోళ్లకు వడదెబ్బ తగలకుండా షెడ్‌పై స్ప్రింకర్లు ఏర్పాటు చేయాలి.

బైక్‌తో సహా బావిలో పడి రైతు మృతి



దేవేందర్ (ఫైల్)



దేవేందర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

సంగెం: రోడ్డు పక్కన ఉన్న బావిలో బైక్‌తో పడి ఓ రైతు మృతి చెందిన విషాద సంఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్.నరేష్ తెలిపిన వివరాలు.. పర్వతగిరి మండలంలోని కొంకపాక గ్రామానికి చెందిన బొంత దేవేందర్ (40) గురువారం ఐకేపీ సెంటర్‌లో ధాన్యం విక్రయించాడు. కాంటా అనంతరం వాటికి సంబంధించిన ట్రక్‌షీట్లను తీసుకుని నక్కలపల్లిలోని మహాలక్ష్మి రైస్ మిల్‌కు బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం అయిన తిరిగి ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మహాలక్ష్మి రైస్‌మిల్ వద్దకు వెళ్లి అడిగితే అక్కడకు రాలేదని వారు సమాధానమిచ్చారు. కాగా శుక్రవారం సంగెం మండలం ఆశాలపల్లి శివారులోని చల్లగొండ దేవేందర్‌రావు, శాంతారావులకు చెందిన రోడ్డు పక్కన గల వ్యవసాయ బావిలో మోటార్ సైకిల్‌తో సహా ఓ వ్యక్తి పడి మృతి చెందినట్లుగా సమాచారం అందింది. దీంతో ఫైరింజన్, క్రేన్ లిఫ్టర్ సహాయంతో బావిలో నీటిని తోడగా దేవేందర్ మృతదేహం లభ్యమైంది. బైక్‌ను మృతదేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టమ్ నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మృతుడి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా దేవేందర్ ఎదురుగా ఏదైనా వాహనం వస్తుంటే తప్పించబోయి బావిలో పడ్డడా? లేదా మూలమలుపు వద్ద రోడ్డుకు షోల్డర్ లేకపోవడం వల్ల పడిపోయాడా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ సర్పంచ్ దంపతులపై కేసు

హసన్‌పర్తి: గంటూరుపల్లి మాజీ సర్పంచ్ పెద్ది తిరుపమ్మ, ఆమె భర్త పెద్ది మల్లారెడ్డిపై హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదైంది. ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి రజనీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కొంతకాలంగా మాజీ సర్పంచ్ పెద్ది తిరుపతమ్మ, పంచాయతీ కార్యదర్శి రజనీ మధ్య పెండింగ్ బిల్లుల విషయమై గొడవలు జరుగుతున్నాయి. కాగా, శుక్రవారం తన విధులను అడ్డుకున్నారని రజనీ ఫిర్యాదు చేశారు.



ఎండలోనుంచి వచ్చిన వెంటనే
చల్లటి నీళ్లు తాగుతున్నారా?

ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన వెంటనే ఫ్రిడ్జ్ లోనుంచి బాటిల్ తీసుకుని చల్లని నీళ్లు గటగటా తాగడం చాలా మందికి అలవాటే. విపరీతమైన వేడిలో మన శరీరానికి రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీరు కొంత ఉపశమనం కలిగించేమాట నిజమే అయినా ఇలా చేయడం మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు.

ఎండలోనుంచి వచ్చిన వెంటనే చల్లటి నీళ్లు తాగడం వల్ల గొంతు నొప్పి, టాన్సిలైటిస్ సమస్య మాత్రమే కాదు.. జీర్ణక్రియ నుంచి రోగనిరోధక వ్యవస్థ వరకు... చివరకు గుండెపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది.

ఎందుకంటే రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని తాగడం వల్ల రక్తనాళాలు కుచించుకుపోతాయి. అదేవిధంగా ఆహారం తిన్న తర్వాత చల్లటి నీరు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గిపోయి జీర్ణక్రియలో సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఘన ఆహారం సరిగా జీర్ణం కాదు. ఫలితంగా మలబద్ధకం వస్తుంది.

అంతేకాదు, చల్లటి నీటిని తాగడం వల్ల ఈ నాడి చల్లబడుతుంది. ఇది హృదయ స్పందన రేటును తగ్గిస్తుంది. గుండె కొట్టుకునే వేగం ఒక్కసారిగా తగ్గితే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది.

రిఫ్రిజిరేటర్‌లోని చల్లటి నీటిని ఎక్కువగా తాగడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా శరీరంలో వివిధ రకాల సమస్యలు సంభవిస్తాయి. చల్లటి నీటిని తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వు గట్టిపడుతుంది. ఇది బరువు పెరిగేందుకు దారితీస్తుంది.

అందువల్ల వీలయినంత వరకు ఎండలో నుంచి రాగానే చల్లటి నీళ్లు తాగకూడదు. అందులోనూ ఫ్రిజ్‌లోని నీళ్లు తాగడం అసలు మంచిది కాదు. కొంచెంసేపు ఆగిన తర్వాత కుండలోని నీళ్లు లేదా నార్మల్ వాటర్ ముందు తాగి, ఆ తర్వాత చల్లటి నీళ్లు తాగినా ఫరవాలేదు.

మీకు తెలుసా?

మెదడుకు పదును..!



బజారులో నడిచి వెళ్తున్నప్పుడు తెలిసిన వ్యక్తి ఎదురు పడితే వెంటనే పేరు గుర్తురాదు. పలకరింపుగా నవ్వి ఏదో ఒక రకంగా మేనేజ్ చేయాల్సి వస్తుంది. ఇలా తరచూ జరుగుతుంటే మెదడు బద్ధకంగా ఉంటోందని, మతిమరుపు పెరుగుతోందని జాగ్రత్త పడాల్సిందే. వార్ధక్య లక్షణాలను దూరంగా ఉంచడానికి దేహానికి వ్యాయామం చేసినట్లే మెదడు చురుగ్గా ఉండడానికి తగినంత వ్యాయామం కావాలి. రోజూ కనీసం ఒక్క పజిల్‌నైనా పరిష్కరించడం జ్ఞాపకశక్తిని మెరుగుపరుచుకోవడానికి మంచి మార్గం. అలా మెదడును కూడా చురుగ్గా ఉంచినప్పుడే మతిమరుపు అనే వార్ధక్య లక్షణం దూరమవుతుంది. రోజూ ఈ ప్రాక్టీస్ ఉంటే డెబ్బై ఏళ్లు నిండినా సరే జ్ఞాపకశక్తి తగ్గదు. మతిమరుపు దరిచేరదు. దరి చేర్చుకోకూడని మిత్రుడు మతిమరుపు, మెదడు వాడదాం... మెదడును 'వాడి'గా ఉంచుకుందాం.

చక్కెర తగ్గిస్తే కలిగే ప్రయోజనాలివి



చక్కెర ఉన్న పానీయాలు, స్వీట్లు, ఇతర పదార్థాలను తినడం మానేస్తే శరీరంలోకి అధికంగా చేరే కేలరీల పరిమాణం తగ్గుతుంది. దీని వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ● చక్కెరను దూరం పెట్టడం వల్ల హైబీపీ, గుండె జబ్బులు సహా ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే ముప్పు తగ్గుతుంది ● నోటి ఆరోగ్యం, దంత సంరక్షణ కోసం చక్కెరను దూరం పెట్టడం చాలా మంచిది. చక్కెరతో కూడిన ఆహార పదార్థాలను దూరం పెడితే నోటి సమస్యలు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది ● చక్కెర తినడం మానేయడం వల్ల టైప్-2 డయాబెటిస్ వచ్చే అవకాశం కూడా చాలా తగ్గుతుంది. మూడ్ స్వింగ్స్, చిరాకు, కోపం తగ్గుతుంది. చర్మం త్వరగా ముడతలు పడటం తగ్గి కాంతిమంతంగా మారుతుంది ● జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపుబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి.

పిల్లల్లో... వ్యాధి నిరోధకత పెంచండిలా!



వేసవి సెలవలు ఇచ్చేశారు. పిల్లలందరూ ఇంటి దగ్గరే ఉంటారు. ఈ సమయంలోనే వారికి వ్యాధినిరోధక శక్తి అంటే ఇమ్యూనిటీ పెరిగే ఆహారాన్ని అందించడం వల్ల స్కూళ్లు తిరిగి తెరిచి, వర్షాలు పడినా కూడా చిన్నా చితకా వ్యాధులు రాకుండా ఉంటాయి. పిల్లలకు ఎలాంటి ఆహారం అందించాలో తెలుసుకుందాం...

సాధారణంగా పోషకాలన్నీ ఉన్న సమీకృత ఆహారం అందించడం వల్ల వ్యాధినిరోధకత పెరుగుతుంది. అందుకు ఏం చేయాలో చూద్దాం...



గుడ్డు: కోడిగుడ్డులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పిల్లలకు రోజూ ఒక ఉడికించిన గుడ్డు తినిపించాలి. కండరాలు, చర్మం, గుండె ఆరోగ్యానికి గుడ్డు మంచిది. పిల్లల ఎదుగుదలకు అవసరమైన విటమిన్ ఎ, బి2 (రైబోఫ్లేవిన్) కోడిగుడ్డులో లభిస్తాయి.



ఆకుకూరలు: ఆకుపచ్చటి ఆకుకూరలు, కొత్తిమీర, పాలకూర, ఈ సీజన్‌లో సమృద్ధిగా లభించే మునగకాడలు వంటివి తప్పనిసరిగా పెట్టాలి. వీటిలో ఫైబర్ తోపాటు ఐరన్, జింక్, మినరల్స్ లభిస్తాయి.



పెరుగు, మజ్జిగ: పెరుగులో ప్రోబయోటిక్స్, విటమిన్ బి12 లభిస్తాయి. ఇది పొట్టలో చెడు బ్యాక్టీరియా వృద్ధి చెందకుండా కాపాడుతుంది. ఇమ్యూనిటీని పెంచుతుంది. కాబట్టి పిల్లలు ఇష్టంగా తినేలా ఫ్రూట్ యోగర్ట్, వెజిటబుల్స్ రైతా, బూందీ రైతా రూపంలో ఇవ్వొచ్చు.

పసుపు: పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. పిల్లలకు రోజూ ఇచ్చే ఆహారంలో చిటికెడు పసుపును చేర్చడం వల్ల ఆస్తమా, అలర్జీకి సంబంధించిన సమస్యలు దరిచేరకుండా ఉంటాయి. పాలల్లో పసుపు వేసి తాగించడం అలవాటు చేయవచ్చు.

బాదం, జీడిపప్పు, ఎండుద్రాక్ష, వాల్‌నట్స్, అప్రికాట్స్ వంటివి ఎక్కువగా తినిపించడం వల్ల మెదడు ఎదుగుదలకు అవసరమైన పోషకాలు లభించడంతో పాటు పిల్లల్లో ఇమ్యూనిటీ పెరుగుతుంది.

ఇంకా సీజనల్ ఫ్రూట్స్ అయిన మామిడి, జామ, తాటిముంజలు, సపోటా వంటివి ఇవ్వాలి.

పిల్లలకు స్వీట్స్, పంచదార ఎక్కువగా ఉండే ఇతర పదార్థాలైన ఫ్రూట్‌జ్యూస్‌లు, చాక్లెట్స్, ప్యాకేజ్డ్ స్నాక్స్‌ను ఎక్కువగా తినిపించకూడదు. ఇవి ఇమ్యూనిటీని తగ్గిస్తాయి. ముఖ్యంగా పిల్లలు రోజూ తగినంత నిద్రపోయేలా చూడాలి. గంటసేపైనా బయట ఆడుకునేలా ప్రోత్సహించాలి. ఈ జాగ్రత్తలు పాటించడం మంచిది.

హెల్త్ టిప్స్



● కిస్మిస్‌లలో జింక్, కాల్షియం, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు ఎంతగానో మేలు చేస్తాయి. రాత్రిపూట కొన్ని కిస్మిస్‌లను తిని గోరువెచ్చటి నీరు తాగితే మరుసటి రోజు ఉదయం విరేచనం సాఫీగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. దీంతో పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. అలా కాకపోతే రాత్రి పూట కిస్మిస్‌లను నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం కూడా తినవచ్చు. ఎలా తిన్నా సమస్య నుంచి బయట పడతారు.

● బాదంపప్పులో ప్రోటీన్లు, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఇ, కాల్షియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. అందువల్ల బాదంపప్పును రోజూ తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇందుకు గాను బాదంపప్పును రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపునే వాటిని పొట్టు తీసి తినాలి. దీని వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోవడంతోపాటు మలబద్ధకం తగ్గుతుంది. పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

● జామపండ్లలో విటమిన్లు, మినరల్స్ అనేకం ఉంటాయి. ఇవి దంతాలు, చిగుళ్ల సమస్యలు, జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. జామ పండ్లను తినడం వల్ల తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మలబద్ధకం ఉండదు. అలాగే పైల్స్ కూడా తగ్గిపోతాయి. రోజూ రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రకు ముందు ఒక జామ పండును తింటే ఈ ప్రయోజనం కలుగుతుంది. దీంతో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

● రోజూ పరగడుపునే మూడు లేదా నాలుగు పచ్చి వెల్లుల్లి రెబ్బలను తీసుకుని పెనంపై వేసి వేయించి వాటిని అలాగే తినాలి. నేరుగా తినలేం అనుకుంటే తేనెతో కలిపి తీసుకోవచ్చు. దీని వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. మెటబాలిజం మెరుగు పడుతుంది. గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. అజీర్ణం నుంచి బయట పడతారు. మలబద్ధకం తగ్గి పైల్స్ నుంచి విముక్తి పొందవచ్చు.

● జీర్ణ సమస్యలను తగ్గించడంలో బెల్లం అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ రాత్రి భోజనం అనంతరం చిన్న బెల్లం ముక్కను చప్పరిస్తూ తినాలి. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మరుసటి రోజు సుఖ విరేచనం అవుతుంది. క్రమం తప్పకుండా రోజూ రాత్రి బెల్లం తింటే పైల్స్ సమస్య నుంచి బయట పడవచ్చు.

సినిమా

కన్నప్పకి బై బై


● విష్ణు మంచు, అక్షయ్ కుమార్

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ 'కన్నప్ప'కి బై బై చెప్పారు. తన పాత్రకి సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేసిన ఆయనకి చిత్ర యూనిట్ వీడ్కోలు పలికింది. విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైన షెడ్యూల్‌లో అక్షయ్ కుమార్ జాయిన్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా తన సీన్లకు సంబంధించిన షూట్‌ను ఆయన పూర్తి చేశారు. ''అక్షయ్ కుమార్‌గారి నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ ప్రయాణం ఎంతో విలువైనది'' అని సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు విష్ణు మంచు. ''ధైర్యవంతుడైన యోధుడు, శివ భక్తుడైన కన్నప్ప కథతో ఈ చిత్రం అద్భుతంగా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది'' అన్నారు మేకర్స్.


● నయనతార

టాక్సిక్‌లో..?

యశ్

'టాక్సిక్' సినిమాలో నయనతార భాగం కానున్నారా? అంటే అవుననే టాక్ కన్నడ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. యశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'. మలయాళ నటి-దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ, శ్రుతీహాసన్ వంటి స్టార్స్ పేర్లు వినిపించాయి. అలాగే యశ్‌కు సోదరి పాత్రలో కరీనా కపూర్ నటిస్తారనే ప్రచారం జరిగింది. దీనికి తోడు తాను సౌత్ సినిమా అంగీకరించినట్లు ఆ మధ్య కరీనా స్వయంగా వెల్లడించారు. అది 'టాక్సిక్' సినిమానే అనే ప్రచారం సాగింది. అయితే తాజాగా షూటింగ్ కాల్షీట్స్ సర్దుబాటు చేయలేని కారణంగా ఈ ప్రాజెక్ట్ నుంచి కరీనా కపూర్ తప్పుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్లేస్‌లో నయనతారను తీసుకోవాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. 2010లో ఉపేంద్ర నటించిన 'సూపర్' కన్నడలో నయనతారకు తొలి సినిమా. వార్తల్లో ఉన్న ప్రకారం నయనతార 'టాక్సిక్' సినిమా చేస్తే.. పద్నాలుగేళ్ల తర్వాత ఆమె కన్నడ సినిమా చేసినట్లవుతుంది.

ముంబైలో వేట్టయాన్


● అమితాబ్ బచ్చన్ ● రజనీకాంత్

ముంబైలో అమితాబ్ బచ్చన్‌ను కలిశారు వేట్టయాన్. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వేట్టయాన్' (వేటగాడు). అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా ఇతర లీడ్ రోల్స్‌లో దుషారా విజయన్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఇది. తాజాగా 'వేట్టయాన్' చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన 'వేట్టయాన్' షూటింగ్ షెడ్యూల్‌లో రజనీ, అమితాబ్ కాంబినేషన్ సీన్స్ తీశారు. ఇప్పుడు ముంబైలో వీరిద్దరి కాంబినేషన్ సీన్స్‌ను తీస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్.

వినోదాల పతంగ్


● ప్రీతి పగడాల

ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వం వహించారు. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్‌పై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను డైరెక్టర్ బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈ సినిమా కాంటెస్ట్ విజేతలకు సిరిసిల్ల మాజీ ఎంపీ రాజయ్య బహుమతులు అందించారు. బుచ్చిబాబు సానా మాట్లాడుతూ- ''ఈ మూవీ కంటెంట్ చూస్తుంటే 'హ్యాపీడేస్' సినిమాలా ఘన విజయం సాధిస్తుందనిపిస్తోంది'' అన్నారు. ''తొలిసారి పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'' అన్నారు ప్రణీత్ ప్రత్తిపాటి. ''వేసవిలో మా సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు సంపత్ మక. ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల, వంశీ పూజిత్, క్రియేటివ్ నిర్మాత నాని బండ్రెడ్డి పాల్గొన్నారు.


● మెరిల్ స్ట్రీప్

ఈ పురస్కారం నాకో గౌరవం

హాలీవుడ్

ప్రముఖ నటి మెరిల్ స్ట్రీప్ ఆనందంలో ఉన్నారు. ఈ నెల 14 నుంచి 25 వరకు ఫ్రాన్స్‌లో 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ చలన చిత్రోత్సవాల్లో ప్రతిష్ఠాత్మకమైన పామ్ డి ఓర్ గౌరవ పురస్కారానికి మెరిల్ స్ట్రీప్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆమె ఆనందానికి కారణం ఇదే. ఈ ఏడాది మెరిల్ స్ట్రీప్‌కు, జపాన్‌కు చెందిన యానిమేషన్ 'స్టూడియో ఘిబ్లి' నిర్వాహకులకు, హాలీవుడ్ దర్శక-నిర్మాత జార్జ్ వాల్టన్ లూకాస్ జూనియర్ (స్టార్ వార్స్, ఇండియానా జోన్స్' ఫేమ్)కు పామ్ డి ఓర్ పురస్కారాన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా మెరిల్ స్ట్రీప్ మాట్లాడుతూ - ''ఈ అవార్డుకు ఎంపిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. అంతర్జాతీయ నటీనటులు, ఫిల్మ్ మేకర్స్ భాగస్వామ్యులైన కాన్స్ వేదికగా నేను ఈ అవార్డును గెలుచుకోవడం అనేది ఫిల్మ్ మేకింగ్ రంగంలో నాకు దక్కిన ఓ అద్భుత విజయంగా భావిస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు. గతంలో హాలీవుడ్ స్టార్స్ టామ్ క్రూజ్, మైఖేల్ డగ్లస్, హారిసన్ ఫోర్డ్ వంటివారికి పామ్ డీ ఓర్ అవార్డు దక్కింది.

లక్ష్మీ కటాక్షం ఫిక్స్


● 'లక్ష్మీ కటాక్షం' పోస్టర్


సాయికుమార్ లీడ్ రోల్‌లో సూర్య దర్శకత్వం వహించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం: ఫర్ ఓట్'. ఆమని, వినయ్, అరుణ్, దీప్తీ వర్మ, చరిష్మా శ్రీకర్, హరి ప్రసాద్, సాయికిరణ్ ఏడిద కీలక పాత్రల్లో నటించారు. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న రిలీజ్ కానుంది. ''పొలిటికల్ సెటైరికల్ డ్రామా, కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలో ఓటర్లే వారి ఓటుకు ఒక రేటు నిర్ణయించుకుని నాయకులని ముప్పు తిప్పలు పెట్టే సీన్లు ప్రేక్షకులను నవ్విస్తాయి'' అన్నారు మేకర్స్.

ఎమోషనల్ సత్య

సమాజంలో తన వల్ల తన తల్లిదండ్రులకు ఏ మాత్రం ఇబ్బంది కలగకూడదని ఆలోచించే ఓ కొడుకు కథతో రూపొందిన చిత్రం 'సత్య'. హమరేశ్, ప్రార్థనా సందీప్ జంటగా నటించిన ఈ చిత్రానికి వాలీ మోహన్‌దాస్ దర్శకుడు. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా వాలి మాట్లాడుతూ- ''సత్య' సినిమా హిట్ అయి, యూనిట్‌కి మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''ఈ సినిమా సెన్సార్ పూర్తయింది. ఈ నెల 10న తెలుగు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో సినిమాను విడుదల చేయనున్నాం'' అన్నారు శివ మల్లాల.


● హమరేశ్, ప్రార్థన

1980లో ఏం జరిగింది?


● రాకేష్ వర్రె

'ఉయ్యాలా జంపాలా, మజ్ను' చిత్రాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. రాకేష్ వర్రె హీరోగా నటించారు. వైశాలీ రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాశ్ ఇతర పాత్రల్లో నటించారు. ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా విరించి వర్మ మాట్లాడుతూ- ''1980లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా పొలిటికల్ డ్రామాగా ఈ సినిమాను రూపొందించాం. ప్రేమకథలు దర్శకత్వం వహించిన నేను 'జితేందర్ రెడ్డి' లాంటి యాక్షన్ మూవీ చేయడంతో క్రేజ్ నెలకొంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వీఎస్ జ్ఞాన శేఖర్, సంగీతం: గోపీ సుందర్.

సూపర్ డీలక్స్...


● అషు రెడ్డి

'బిగ్ బాస్' ఫేమ్ అషు రెడ్డి, చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, జై భారత్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నవదీప్, పవన్ గోపరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో హారిక పాత్ర చేస్తున్న అషు రెడ్డి లుక్‌ను విడుదల చేశారు. ''మహిళా సాధికారతను చాటి చెప్పే నేపథ్యంలో 'యేవమ్' ఉంటుంది. నా బాడీ సూపర్ డీలక్స్ అని అషు రెడ్డి కిక్ ఇచ్చే పాత్రలో ఎందుకు కనిపించబోతున్నారో తెలియాలంటే 'యేవమ్' విడుదల వరకు ఆగాల్సిందే. కొత్త కథతో వైవిధ్యమైన నరేషన్‌తో ఈ సినిమా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

ఏమయ్యిందే...


● అశోక్ గల్లా, మానస

అశోక్ గల్లా, వారణాసి మానస జంటగా నటిస్తున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. 'హనుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే తొలి పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సురేష్ గంగుల రాసిన ఈ పాటని ఈశ్వర్ దాతు పాడారు.